# కనబడుటలేదు

-"శ్రీ కంఠస్ఫూర్తి"

రామ్మూర్తి నాకు రాజమండ్రి కోటగుమ్మం సెంటర్లో కనిపించాడు..!

మనిషి కంగారుగా ఉన్నాడు. దేని గురించో కలవరపడుతున్నట్టుగా అనిపించాడు... అటూ ఇటూ, వచ్చీ పోయే జనాలవైపు ఆత్రంగా చూస్తున్నాడు.

రామ్మూర్తి పదవ తరగతిలో నా క్లాసుమేటు... ఒకే బెంచీలో, చాలా కాలం కూర్చున్నా... పరిచయానికి ఎక్కువ, స్నేహానికి తక్కువ అన్నట్లుగా ఉండేవాళ్లం. అతని అన్నయ్యలిద్దరూ కాలేజీలో చదువుతూ ఉండేవాళ్ళు. రామ్మూర్తి చదువులో అంతంతమాత్రంగానే ఉండేవాడు...!

ఆ సందర్భం అలా ఉంచితే... ఓ పదేళ్ళ తరువాత ఊళ్ళు తిరిగే నా ఉద్యోగభ్రమణంలో, సుమారు అయిదేళ్ళు పిఠాపురంలో... రామ్మూర్తి సొంత ఇంట్లో... ఒక పోర్షనులో... నా శ్రీమతి ఇద్దరు పిల్లలతో, అద్దెకు ఉండటం తటస్థించింది...! ఇంటి యజమానిగా రామ్మూర్తి కాస్త హుందా, దర్పం ప్రదర్శించేవాడు...

అప్పుడు కూడా, అతడు నాకు పరిచయస్థుడి కంటే ఎక్కువ...

నేను, అతగాడికి, స్నేహితుడి కంటే, మీదుమిక్కిలి తక్కువ...!

రామ్మూర్తి నన్ను గుర్తుపట్టినట్లుగా రెండు చేతులూ పట్టుకున్నాడు...

"నువ్వు... మీరు..."

"అవును... నేనే సత్యమూర్తిని..! మీరేవిటి ఏదో కంగారుగా ఉన్నారు..."

నేను సాలోచనగా అడిగాను..

"నాన్నగారు కనబడటంలేదు. నెలరోజులయింది. ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయారు... ఆయన కోసం ఊళ్ళు వెదుకుతున్నాం!"

"నాన్నగారు కనబడటం లేదా? ఆయన కోసం ఊరూరా తిరుగుతున్నారా?

అయ్యో...! అయినా ఏ వూళ్ళో ఉన్నారని వెదుకుతారు? ఎన్ని ఊళ్ళని వెదుకుతారు...?" నేను సానుభూతి ప్రకటించాను.

"కొడుకులుగా మా ప్రయత్నం మేము చేయాలికదా..." రామ్మూర్తి గొంతులో నిజాయితీ ధ్వనించింది.

"అంటే... మీ అన్నయ్యలు కూడా వెదుకుతున్నారా...? ఆయన వయసెంత...?"

"ఎందుకు వెళ్ళిపోయారు...? మీరిప్పుడు ఏ వూళ్ళో వుంటున్నారు...? పేపర్లో ప్రకటన ఇవ్వలేకపోయారా...?" సందేహ నివృత్తి కోసం వరుసగా ప్రశ్నలు సంధించాను.

"నాన్నగారి వయస్సు అరవై డెబ్బయి మధ్య ఉంటుంది. అనారోగ్యం ఏమీ లేదు... కాకపోతే మనస్సు కాస్త స్థిమితం తప్పింది. ఏవిటో తనలోతానే మాట్లాడుకోవడం... సణుక్కోవడం... గొణుక్కోవడం అన్నట్లుగా ఉండేవారు.... అమ్మపోయిన తరువాత - నా వద్ద, అన్నయ్యల దగ్గర, నాలుగేసి నెలలు వంతులవారీగా ఉంటున్నారు... అన్నయ్యలిద్దరికీ కాకినాడలోనే ఉద్యోగాలు... నేను పిఠాపురంలోనే ఉంటున్నా... పేపర్లో ప్రకటన ఇస్తే... బంధువుల్లోనూ, స్నేహితుల్లోనూ సిగ్గుగా... అవమానంగా ఉంటుందనీ..." రామ్మూర్తి సహానంగా సమాధానాలు చెప్పాడు.

అంతా విన్న నాకు, ఎందుకో హృదయం నిండా వింత ఆనందం గంతులేసింది... వృద్ధతరాన్ని పనికిరాని వస్తువులుగా పరిగణిస్తున్న ఈ రోజుల్లో...

అనుక్షణం... తమ అసహనాల్ని, అసహ్యాల్ని ప్రదర్శిస్తూ... హింసిస్తూ... ద్వేషిస్తూ... వదిలించుకోవడమే ఉత్తమంగా... కొడుకులు, తల్లిదండ్రుల్ని - వృద్ధాశ్రమాలకు తరలిస్తూ...



## ఓ... తొలి మహిళా కావ్యనిర్మాత మొల్లా!

నీ కవిత... అచ్చ తెనుగు నుడికారం!
నీ కవిత్వ శైలి... స్వచ్ఛమైన భారతీయం!
'శిరీష పుష్పం' లాంటిదే... నీ సారస్వత పద్యం!
కుమ్మరి చక్రం... నీ సృజనాత్మక విన్యాసం!
ఓ... తొలి మహిళా కావ్య నిర్మాతా...
కవయిత్రి మొల్లా!!
నీవేనమ్మా... మా ఇంటి ఆడపడుచు!
నీ కవిత్వం భావి భారతికి...
మామిడి లాంటి... మహిళా తోరణం!
ప్రతిభా కిరణాలు వెదజల్లే... పచ్చతోరణం!!

**– కుమ్మరి భిక్షపతి**

అనుబంధాల్ని కాలరాస్తున్న ఈ కాలంలో...

ఒక తప్పిపోయిన తండ్రి కోసం, కొడుకులు... ఆరాటంగా ఊళ్ళు వెదకడం నా కెంతో అపురూపమైన దృశ్యంగా అనిపించింది...!

''రామ్మూర్తి! రా!'' కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం!" రామ్మూర్తి చేయి పట్టుకుని 'అప్సరా' వైపు దారితీశాను.

"ఇప్పుడు కాఫీ ఏమీ వద్దులే... ఇదిగో, నాన్నగారి ఫొటో ఒకసారి చూడు..."

రామ్మూర్తి జేబులోంచి ఫోటో తీసి చూపించాడు. ఆ ఫోటోలో రామ్మూర్తి - పోలికలతోనే ఉన్న ఒక వృద్ధుడు ఉన్నాడు...!

"ఎక్కడైనా కనిపిస్తే... కాకినాడ, సాలిపేట, వినాయకుడి గుడి వెనుక – గాజులవారి వీథిలో, అన్నయ్య వాళ్ళూ ఉంటున్నారు... పిఠాపురంలో నా అడ్రసు నీకు తెలుసుగా...! ఇప్పుడు నేను ధవళేశ్వరం వెళ్ళాలి... అక్కడ, దూరపు బంధువుల్ని, నాన్న గురించి విచారించాలి...!"

రామ్మూర్తి నన్ను వదిలించుకుని హడావుడిగా వెళ్ళిపోయాడు...!

అతను, నా గురించి, ఒక్కమాటా అడగనందుకు నేనేమీ బాధపడలేదు... ఒకే బెంచీలో కూర్చుని చదువుకున్నా... అయిదేళ్ళు అతని సొంత ఇంట్లో అద్దెకు ఉన్నా... మా మధ్య స్నేహం చిగురు తొడగలేదూ అంటే... నా ప్రవృత్తే కారణం కావచ్చు... మునిసిపాలిటీలో... వీథుల్లో పారిశుధ్యపు పనివాళ్ళ మీద అజమాయిషీ చేసే... రామ్మూర్తి ఉద్యోగ వృత్తి నైజం... నా మీద ప్రయోగించడానికి, అప్పుడప్పుడూ... ప్రయత్నించడమూ కావచ్చు...!

* * *

నాది ఊళ్ళు తిరిగే ఉద్యోగం కాబట్టి... నెలలో, పదిహేను రోజులు పై ఊళ్ళల్లో ఉండవలసిన పరిస్థితి... జిల్లాల వారీగా ప్రయాణం చేస్తూ ఒక ప్రభుత్వరంగ సంస్థ ఉత్పత్తుల్ని తనిఖీ చేసే ఇన్‌స్పెక్టరు ఉద్యోగం...!

ఒకరోజు... తణుకులో, వేల్పూరు రోడ్డులో, నా ఇద్దరు సిబ్బంది మిత్రులతో కలసి నడుస్తోంటే... ఎవరో పిలిచినట్లయి వెనక్కు తిరిగాను...


అపరిచిత వ్యక్తి ఎవరో... నా వైపుగా నడిచి వస్తున్నాడు... పెరిగిన పొట్ట,బట్టతల... లావుగా, ఎత్తుగా ఉన్నాడు...!

"ఎవరీయన...? నన్నేనా పిలుస్తున్నది...? ఎక్కడో చూసినట్టుందే...?"

ఆలోచనగా నిలబడ్డ నా వద్దకు ఆయాసపడుతూ వచ్చాడాయన...!

"మీరు..."

"సత్యమూర్తి"



"అవునవును... మా తమ్ముడి క్లాస్‌మేట్ కదూ...? మీరు మా ఇంట్లో కొంతకాలం..."

"ఆc మీ పేరూ..." రామ్మూర్తి అన్నయ్యగా అతని రూపం స్ఫురణకొచ్చింది...

"బలరాం! కాకినాడలో, ఆర్ అండ్ బి లో అకౌంటెంట్‌గా వర్క్ చేస్తున్నాను..." బలరాం నాతో కరచాలనం చేశాడు. నా ఉద్యోగ వివరాలు అడిగాడు. చెప్పాను...

"ఆ మధ్య రామ్మూర్తి రాజమండ్రిలో కనిపించాడు.. మీరేవిటిక్కడా...?"

"మా నాన్నగారు తప్పిపోయారు కదా...! రామ్మూర్తి మీకు చెప్పలేదా...?"

బలరాం ఆశ్చర్యంగా అడిగాడు..

"చెప్పాడు... అప్పట్నుంచీ ఆయన కనపడలేదా...? ఏమయ్యారో పాపం...?

ఈ వయసులో... ముగ్గురు కొడుకుల రక్షణలో, హాయిగా కాలం వెళ్ళబుచ్చవలసిన వారు కదా...! ఆలనా పాలనా లేకుండా.. ఎక్కడ తిరుగుతున్నారో... ఎలా ఉన్నారో...?"

విచారం వ్యక్తం చేశాను... కనపడకుండా పోయిన ఆ వెర్రి తండ్రిని తలచుకుంటే...

నాకూ గుండె బరువెక్కినట్లయింది...!

"కాకినాడ చుట్టు ప్రక్కల ఊళ్ళు... తుని నుంచి, అమలాపురం వరకూ అన్నీ వెదికాం...

ఎవరో చెప్పారు... తణుకూ, భీమవరం మధ్య ప్రాంతంలో, మా నాన్నగారిలా ఉన్న - ఆకారాన్ని చూశామని... ఆ వార్త పట్టుకుని ఇలా ఈ వూరు బయలుదేరి వచ్చాను..."

బలరాం, బరువుగా మాట్లాడుతూ... చేతిలో బ్రీఫ్‌కేసును నేలమీద ఉంచాడు.

"పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వలేకపోయారా...? ఇలా ఎంతకాలం ఎన్ని ఊళ్ళని తిరుగుతారు...?" సలహా ఇవ్వకుండా ఉండలేకపోయాను...

"పోలీసులకీ తెలియపరిచాం... వాళ్ళ కివ్వాల్సిన ఆనవాయితీలు అందచేశాం...

ఎప్పుడు వెళ్ళినా... మా ప్రయత్నం మేము చేస్తూనే ఉన్నామండీ అంటారు... ఏం చేస్తాం..?"

బలరాం ఆవేదన వెలిబుచ్చాడు.

మేము బసచేసిన లాడ్జి వైపు నడుస్తూ

ఉండగా... బలరాం మమ్మల్ని - అనుసరించాడు... మేము దిగిన లాడ్జిలోనే ఒకగది తీసుకున్నాడు. గదిలోకి వెళ్తూ...

"ఏమండీ! ఇదిగో నాన్నగారి ఫొటో... పేపర్లో ప్రకటన వేయించాం! ఈ కాపీ మీ వద్ద ఉంచండి...!" బలరాం ఒక పేపరుముక్క నా చేతిలో పెట్టాడు.

ఆ పేపరులో... "కనబడుటలేదు." అన్న శీర్షికలో... బలరాం, రామ్మూర్తిల తండ్రి ఫొటో క్రింద ఇలా రాసి ఉంది...!

"ఈ ఫోటోలో కనిపించే వ్యక్తి మా నాన్నగారు... వయసు అరవై అయిదు..

కాస్త మతి స్థిమితం తప్పి రెండు నెలలుగా కనిపించుటలేదు... ఆయన ఇల్లు విడిచి వెళ్ళేసరికి... పొడుగు చేతులచొక్కా పైన పంచెలోనూ ఉన్నారు. మెడలో - రాగి తాయెత్తు... నుదుటి మీద కాల్చినమచ్చ... నెరిసిన తల... పై వ్యక్తి ఆచూకీ తెల్పిన వారికి... తీసుకొచ్చిన వారికి... తగిన బహుమానము ఇవ్వబడును...!

ఇట్లు కుమారులు... వెంకటేశ్వర్లు... బలరాం... రామ్మూర్తి...!

తండ్రి తప్పిపోవడం కాదుగానీ, ముగ్గురు కొడుకులు, ఆ తండ్రి యెడల ప్రదర్శిస్తోన్న శ్రద్ధాసక్తులు, ఆపేక్ష, భక్తి ప్రపత్తులు చూసి నాకెంతో ముచ్చటేసింది... వాళ్ళ మనసులు ఎంత గొప్పవి అనిపించింది. మానవీయ సంబంధాల మీద... అపారమైన నమ్మకం నాకు కలిగింది...

అదే సమయంలో... కనపడకుండా పోయిన ఆ తండ్రి మీద కరుణ, జాలి కలిగాయి. అంతరంగాన్ని చిత్రంగా కలచివేశాయి.

ఇలా మనుషులు ఎందుకు కనిపించకుండా పోతారు...? పిచ్చివాళ్ళుగా ఎందుకు మారిపోతారు...? మనసులు ఎందుకు గతులు తప్పుతాయో...? స్థిరత్వాన్ని ఎందుకు కోల్పోతాయో...? ఏ కష్టాల కొలిమిలో... ఏ బాధల అగ్నికీలలు... ఆ సున్నిత మనసుల్ని మసిచేసి... నుసి చేస్తాయో...? రోడ్డుమీద ఫుట్‌పాత్‌ల మీద... ఎంతమంది అనాథలు... పిచ్చివాళ్ళు...? దిక్కులేనివాళ్ళుగా... దిగంబరంగా... దీనంగా... హీనంగా... ప్రపంచంతో సంబంధం లేకుండా... నిర్లజ్జగా... నిస్సిగ్గుగా... పీలికలైన బట్టలతో... మురికి కుండీల్లోని చెత్తనంతా ఒంటికి చుట్టుకుని... తమలో తాము మాట్లాడుకుంటూ... నవ్వుతూ... ఏడుస్తూ... గంతులేస్తూ... ఎవరిమీదో, తమ కోపతాపాల్ని వ్యక్తం చేస్తూ... ఎండలో ఎండుతూ... వానలో తడుస్తూ... ఏ హింసలు... ఏ సమస్యలు... వాళ్ళనలా మార్చివేశాయో...? రామ్మూర్తి, బలరాంల తండ్రి కూడా వాళ్ళలో ఒకడిగా తిరుగుతూంటాడా...? బలరాం ఇచ్చిన పేపరుముక్క... నా డైరీలో దాచుకున్నాను...! భారంగా బసచేసిన గదిలోకి అడుగులు వేశాను...!

* * *

మరో నెల తరువాతేమో.... ఇద్దరు సిబ్బందితో కలసి, ఒక ఆఫీసు తనిఖీ నిమిత్తం - నేను పిఠాపురం వెళ్ళాల్సి వచ్చింది... 'జ్యోతి' లాడ్జిలో దిగాం...!

మూడు రోజుల పని... రెండురోజుల్లోనే ముగిసింది...! ఆ రాత్రికే తిరుగు ప్రయాణం... సాయంత్రం నాలుగున్నరయింది...!

చిన్న బజారులోంచి... మునిసిపల్ ఆఫీసుదాటి, 'అక్కమ్మ' హోటల్‌లో వేడి వేడి పకోడీలు తిని... టీ త్రాగాం! నేను పిఠాపురం విడిచిపెట్టి చాలా ఏళ్ళయినా ఊరు రూపురేఖల్లో పెద్ద మార్పు వచ్చినట్లు ఏమీలేదు... రోడ్ల పరిస్థితి అలాగే ఉంది... ఎందుకో నాకు రామ్మూర్తి మనసులో మెదిలాడు... అయిదేళ్ళకు పైగా నేను అద్దెకు ఉన్న రామ్మూర్తి ఇల్లు... ఆ ఇల్లు ఉన్న మేకా వారి వీధి గుర్తుకు వచ్చాయి... అంతకుమించి... రామ్మూర్తి తండ్రి తప్పిపోవడం... ఆయన కోసం, కొడుకులు తల్లడిల్లిపోతూ ఊళ్ళు వెదకడం వెంటనే స్ఫురించింది.

ఆ తండ్రి కనిపించాడా...? కనపడకుండా పోయాడా...? ఏం జరిగింది పాపం...?

మనసు పొరల్లో... ఏదో బాధా శకలం...!

ఒకసారి పలకరించి... పరామర్శించి... విషయం తెలుసుకుని వస్తే...?

ఒక అరగంటలో తిరిగి వస్తానని... మిత్రులిద్దర్నీ లాడ్జికి వెళ్ళమని చెప్పాను...!

వాళ్ళకు తోడుగా... స్థానిక ఆఫీసు సహచరులు ఎలాగూ ఉన్నారు...

'అక్కమ్మ హోటలు' సెంటరుకు, మేకా వారి వీధి అరఫర్లాంగు దూరం కూడా ఉండదు... గబగబా ముందుకు నడిచాను. సాయిబాబా గుడి మీదుగా...

సూర్య ఆయుర్వేద నిలయం వద్ద మలుపు తిరిగి... మేకావారి వీధిలోకి మళ్ళాను... దారి ఇరుకైనా... అలవాటుగా అడుగులు తేలిపడుతున్నాయి. ఇంతకు ముందుకంటే వీధి – అపరిశుభ్రంగా ఉంది... సిమెంటు రోడ్డు... పడుతుందనుకున్నారు అప్పట్లో...

రామ్మూర్తి ఇంటిముందు ఆగాను. అక్కడ కనిపించిన దృశ్యం... వాతావరణం నాకు ఆశ్చర్యాన్నే కాక... ఒకింత అయోమయాన్ని సృష్టించాయి...!

అరుగుమీద... రామ్మూర్తితోబాటు, అతని అన్నయ్యలిద్దరూ ఉన్నారు...

వాళ్ళ మధ్యలో... బక్కచిక్కిన బిచ్చగాడి లాంటి ఓ ఆకారం...!

రామ్మూర్తి నన్ను చూసి నవ్వడానికి ప్రయత్నించి... పైకి రమ్మని పిలిచాడు. అన్నయ్యల ముఖాల్లో గాంభీర్యం సడలలేదు...

నేను మెట్లెక్కి పైకి వెళ్ళి రామ్మూర్తి ప్రక్కనే కూర్చున్నాను...!

మధ్యలో కూర్చున్న బక్కచిక్కిన ఆకారం... బిక్కు బిక్కుమంటూ నావైపు చూస్తోంది... ఆ ఆకారం తమ తండ్రేనట...! గంట క్రితమే... పెద్దన్నయ్య పురమాయించిన మనిషి వెంటబెట్టుకుని వచ్చాడట... ఎక్కడో నర్సీపట్నం అడ్డరోడ్డు వద్ద... ఒక కాకా హోటలు ముందు... "టీ ఇవ్వవా!" అంటూ కాకిలా అరుస్తూ కనిపించాడట...!

రామ్మూర్తి చిన్న గొంతుతో... నాతో చెప్పాడు...!

నిజంగానే నాకు ఒళ్ళు జలదరించినట్లయింది...!

ఎంత యాదృచ్ఛికం...? సరిగ్గా ఇదే సమయానికి నేను వీళ్ళ ఇంటికి రావడం... ఈ తండ్రిని కళ్ళారా చూడటం...? ఒంటిమీద బట్టలనిండా పేరుకుపోయిన మురికి... దుమ్ము... ధూళి... అట్టలు కట్టినట్లున్న జుట్టు... పెరిగిన గడ్డం... లోతుకుపోయిన కళ్ళు... చిక్కి శల్యమైన శరీరంతో... రోగిష్టిలా ఉన్న ఈ వృద్ధుడు.. ఎందుకు ఊరు విడిచి వెళ్ళిపోయాడు...? మనో వైకల్యమే కారణమా...?

ఈ అన్నదమ్ములు... నన్ను పలకరించి, మర్యాదలు చేయకపోయినా ఫరవాలేదు. గంట క్రితం అనగా వచ్చిన ఈ తండ్రి గొంతులోనయినా గుక్కెడు నీళ్ళు పోశారా...? ఆ వృద్ధుడు అందరివైపు ఓసారి పరికిస్తూ తనలో తాను సణుక్కుంటున్నాడు... ఆ తండ్రిని నేను... నిశితంగా పరిశీలిస్తుండగానే... పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు లేచాడు. సరాసరి తండ్రివద్దకు వెళ్ళాడు. డాబూ దర్పంతో ఆఫీసరులాగే ఉన్నాడతను. ముక్కు మూసుకుంటూ... ముఖ కవళికలు మారుస్తూ... తండ్రి చొక్కా జేబుల్లో

## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

*పత్రిక విడిప్రతి : 5/-*
*ప్రత్యేక సంచిక (ఉగాది, దీపావళి): 10/-*
*సాలుసరి చందా : 60/-*

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**
79బి, జర్నలిస్టు కాలనీ, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-33.

## ఎనుబోతు

సైక్రియాటిస్ట్ రోగితో– 'అయితే నీకు– నేనొక ఎనుబోతును' అనే భావం కలుగుతోంది– అంటావు... ఇలా ఎన్నాళ్ల నుండి?

రోగి: నేను 'దూడ'గా వున్న నాటినుండీనండి.

తన రెండు చేతులూ ఉంచి... దేనికో వెదికాడు... పెదవి విరుస్తూ ఒక నిట్టూర్పు విడిచాడు.

"ఎందుకు అన్నయ్యా! మేము ఇంతకుముందే ఆ జేబులు వెదికాం...

ఒళ్ళంతా తడిమాం... పంచెముడి విప్పి గట్టిగా దులిపాం... ప్చ్...!"

రామ్మూర్తి అన్నాడు. అందుకు బలరాం వంతపాడాడు. ముగ్గురు కొడుకులూ కొంతసేపు ఆలోచనలో పడ్డారు... అనంతరం, తండ్రివైపు తిరిగారు...!

"నాన్నా! ఆ బ్యాంకు లాకరు తాళం చెవి ఎక్కడా...? అది కనబడటం లేదు... నీ దగ్గరేగా ఉండాలి... దాన్ని పట్టుకుని ఊరొదిలిపోయావా...? అమ్మ నగలన్నీ బ్యాంకు లాకరులోనే ఉన్నాయిగా...! అవి తీసుకోవాలంటే... తాళం చెవి కావాలి... ఏదీ...? ఎక్కడుందీ చెప్పు...?" రామ్మూర్తి అనునయంగా అడిగాడు...!

"మాట్లాడు...! నువ్వేం తెలివి తక్కువ వాడివి కాదు... పిచ్చివాడివీ కాదు...

అమ్మనగలు మేమెక్కడ కాజేస్తామో... వాటిని అమ్ముకుని ఎక్కడ అనుభవిస్తామోనని నీ భయం...! అందుకే తాళం చెవి కనపడకుండా చేశావ్ కదూ...? చెప్పు!"

రెండవ కొడుకు బలరాం గద్దిస్తూ నిలదీశాడు...!

"మూడు నాలుగు లక్షలు ఖరీదుచేసే నగలు... వాటితో నీకేం పని...? ఇద్దరు కూతుర్లకీ ఇవ్వాలనుకుంటున్నావా...? కోడళ్ళతో నీకు సరిపడదు... వాళ్ళు నీకు తిండికూడా పెట్టరు... మాతో నీకు పనిలేదు. ఏకంగా, ఆ నగల్ని అమ్ముకుని నీకు నువ్వుగా ఏకాకిగా బ్రతకాలనుకుంటున్నావా...? చెప్పు...? హాయిగా ఈ వయసులో కృష్ణా! రామా! అనుకోక, ఆ నగల మీద తాపత్రయం దేనికి? నీ మనసులో... ఏదో ఉంది... చెప్పు...? ఆ తాళం చెవి ఎక్కడ...? నువ్వు చెప్పకపోతే ఏం చేస్తామో తెలుసా...? ఆ నగలన్నీ కొడుకులం మాకే చెందుతాయి కాబట్టి... నిన్ను మోసుకుపోయి... లాకరు తాళం చెవి ఎక్కడో కనపడకుండా పోయిందనీ... బ్యాంకు ఆఫీసరుతో చెప్పి... దాన్నెలాగూ బ్రద్దలు కొట్టిస్తాం... అప్పుడు నీ పిచ్చి పూర్తిగా తగ్గిపోతుందా...? ఇంకా ముదిరిపోతుందా...? చెప్పు...?"

పెద్దకొడుకు వెంకటేశ్వర్లు పెద్ద గొంతుతో అరుస్తున్నట్టే అడుగుతున్నాడు.

ముగ్గురు కొడుకుల ప్రశ్నలకీ.. ఆ వృద్ధ తండ్రి మాట్లాడడంలేదు...

అయోమయంగా... ఆకాశంలోకి... శూన్యంలోకి... పిచ్చిచూపులు చూస్తున్నాడు.

నా పరిస్థితీ అలాగే ఉంది... అంతకు మించి, కడుపులో ఎవరో చేయిపెట్టి కెలుకుతున్నట్టుగా... గొంతు తడారిపోతున్నట్టుగా... ఉంది.

"మంచినీళ్ళు కావాలి!" అన్నట్టున్నాను... లోపల్నుంచి పదేళ్ళ పిల్ల గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి... చేతికి అందించింది...

గబగబా రెండు గుటకలు నీళ్ళు గొంతులో పోసుకున్నాను...

వృద్ధుడు నావైపు ఆశగా చూస్తూ... నాలిక తడుపుకుంటున్నాడు...

చటుక్కున... మిగిలిన నీళ్ళతో ఉన్న గ్లాసును... అతడి చేతికిచ్చాను.

ఆత్రంగా... ఆబగా... ఆ వృద్ధ తండ్రి గ్లాసును అందుకున్నాడు...

దాహంగా... దయనీయంగా... గొంతు పొలమారగా... గుండెల మీద నీళ్ళు ఒంపుకుంటూ... వెక్కి వెక్కిపడుతూ... ఆ నీళ్ళని త్రాగుతున్నాడు...

నేను దిగ్గునలేచి... మెట్లు దిగి... ఇరుకు వీధిలోంచి... విశాలమైన రోడ్డు మీదకు వచ్చేశాను...

మనుషుల్లో... మనసుల్లో...

కనపడనిది... ఏదో... నాకు కనపడుతూనే ఉంది..!